నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 29 జూలై 2024 RANGAREDDY




# ఈ-ఆఫీస్

## సేవలన్నీ ఇక ఆన్‌లైన్‌లోనే..

రంగారెడ్డి, జూలై 28 (నమస్తే తెలంగాణ) : కలెక్టరేట్‌లో త్వరలోనే ఈ-ఆఫీస్ కార్యకలాపాలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు కాగితాలపై కొనసాగుతున్న సేవలు..ఇకపై ఆన్‌లైన్ ద్వారా సాగనున్నాయి. పాలనలో పారదర్శకత, కచ్చితత్వం, జవాబుదారీతనాన్ని పెంచేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్న కలెక్టర్ శశాంక వీలైనంత త్వరగా ఈ-ఆఫీస్ సేవలను అందుబాటులోకి తేవాలని సంకల్పించారు. అన్ని శాఖలకు సంబంధించిన ఫైళ్లతోపాటు అన్ని రకాల కార్యకలాపాలు ఇకపై ఆన్‌లైన్ ద్వారానే జరుగనున్నాయి. అంతేకాకుండా అధికారులు, సిబ్బందికి సాంకేతిక నైపుణ్యంపై ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నారు.

### సరికొత్త పాలన ..

ప్రస్తుతం కలెక్టరేట్‌లో దరఖాస్తులు, రికార్డులు, ఫైలింగ్ అంతా కాగితాల్లోనే జరుగుతున్నది. అయితే కాలానుగుణంగా పాలనలోనూ మార్పు అనివార్యం కావడంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ నేపథ్యంలోనే నూతన విధానాలతో పాలనను సరికొత్త పుంతలు తొక్కించేందుకు ఈ-ఆఫీసు విధానాన్ని అమల్లోకి తేవాలని కలెక్టర్ సంకల్పించారు. కలెక్టరేట్‌లోని అన్ని శాఖల అధికారులు ఈ విధానాన్ని పాటించేలా నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమైన శాఖలు బల్క్ ఈ-మెయిల్ ఐడీలను క్రియేట్ చేసుకోవాలని సూచించారు. అధికారులు, సిబ్బందికి సాంకేతికతపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ఎన్‌ఐసీ సెంటర్ నుంచి శిక్షణ ఇస్తున్నారు. త్వరలోనే జిల్లా అధికారులంతా అన్ని ఫైళ్లను ఈ-ఆఫీస్ ద్వారానే పంపేలా చర్యలు తీసుకుంటున్నారు.

### ఈ-ఆఫీస్‌లో సేవలు ఇలా..

ఈ-ఆఫీస్ విధానంలో ఏదైనా ఒక దస్త్రం ఇన్ వార్డులోకి రాగానే.. సంబంధిత ఉద్యోగి దానిని స్కాన్ చేసి ఓ నంబర్

రంగారెడ్డి కలెక్టరేట్‌లో త్వరలోనే అందుబాటులోకి రానున్న కాగిత రహిత సేవలు

పాలనలో పారదర్శకత, కచ్చితత్వం, జవాబుదారీతనాన్ని పెంచేందుకు కలెక్టర్ శశాంక ప్రత్యేక చొరవ

సాంకేతిక నైపుణ్యంపై అధికారులు, సిబ్బందికి కొనసాగుతున్న శిక్షణ

కేటాయించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. అనంతరం ఆ దస్త్రం దశల వారీగా పై సెక్షన్లు, చివరకు కార్యాలయ సూపరింటెండెంట్‌కు చేరుతుంది. ఆ అధికారి లాగిన్ అయి ఆ ఫైల్‌ను సంబంధిత అధికారికి పంపిస్తారు. సంబంధిత శాఖ అధికారి ఆ దస్త్రాన్ని పరిశీలించి డిజిటల్ సంతకం చేసి తిరిగి సూపరింటెండెంట్‌కు పంపుతారు. సూపరింటెండెంట్ నుంచి సెక్షన్ అధికారికి, అక్కడి నుంచి ఇన్‌చార్జికి తర్వాత దరఖాస్తుదారుడికి చేరుతుంది. ఇన్‌వార్డ్ నుంచి అధికారి వరకు యూజర్‌ఐడీ, పాస్‌వర్డ్, డిజిటల్ సంతకం కేటాయిస్తారు. తద్వారా ఇన్‌వార్డు నుంచి మొదలుకుని జిల్లా అధికారి వరకు ఈ-ఫైల్‌ను ఎక్కడి నుంచైనా పరిశీలించే అవకాశం ఉంటుంది.

### పారదర్శకత.. జవాబుదారీతనం..

ఈ-ఆఫీస్ విధానంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉంటుంది. కార్యాలయాల్లో దస్త్రం వివ రాలను దరఖాస్తుదారుడు ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు. అది ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలు అంటే గదుల నిండా బీరువాలు, వాటి నిండా దస్త్రాలు దర్శనమిస్తాయి. కొంతకాలానికి దస్త్రాలు శిథిలమై పాత రికార్డులను తీసుకునేందుకు అవకాశం ఉండదు. ఈ-ఆఫీసు ద్వారా రికార్డులు భద్రంగా ఉంటాయి. వచ్చిన దస్త్రం ఎక్కడుందో ఫైల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా తెలుసుకోవచ్చు. రికార్డులను మార్చడం, తారుమారు చేయడం వంటి వాటికి కూడా చెక్‌పడుతుంది. సమయం ఆదా కావడంతోపాటు పనులు త్వరగా అవుతాయి. కొద్ది రోజుల్లోనే కలెక్టరేట్‌లోని అన్ని శాఖల్లోనూ ఈ తరహా సేవలు అందుబాటులోకి రానుండగా..ఇక్కడ విజయవంతం అయ్యాక మండలాల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు సమాచారం. దీనివల్ల జిల్లావ్యాప్తంగానూ ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి.



పింఛన్ డబ్బుల కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

# నో సిగ్నల్..



సిగ్నల్ కోసం రోడ్డుపై మిషన్‌తో చక్కర్లు కొడుతున్న సిబ్బంది

సిగ్నల్ లేక లబ్ధిదారులకు అందని పింఛన్

బయోమెట్రిక్ మిషన్లతో చక్కర్లు కొడుతున్న పోస్టుమెన్

ఇబ్బందుల్లో లబ్ధిదారులు

ప్రభుత్వం స్పందించాలని వినతి

యాచారం, జూలై 28 : మండలంలోని మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య రోజురోజుకూ రెట్టింపవుతున్నది. 4జీ నుంచి 5జీకి దేశం పరుగులు పెడుతున్న ఈ రోజుల్లో గ్రామాలు, గిరిజన తండాల్లో సిగ్నల్ సమస్య ప్రజలను వేధిస్తున్నది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న ఈ తరుణంలో ప్రజలకు అనేక రకాల సేవలు ఇంటర్నెట్‌తోనే అందుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లకు నెట్‌వర్క్ ఎంతో కీలకంగా మారింది. అయితే మండలంలో బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్ సిగ్నల్ రాకపోవడంతో వినియోగదారులు జియో, ఎయిర్‌టెల్ వైపు మొగ్గు చూపారు. అయితే ఇటీవలి కాలంలో జియో సిగ్నల్ సైతం దారుణంగా తయారైంది. 5జీ సేవలని గొప్పలు చెప్పినా ఆశించిన స్థాయిలో ఫలితం ఇవ్వడం లేదు. ఈ సమస్య పింఛన్ల పంపిణీపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. సిగ్నల్ సక్రమంగా రాకపోవడంతో పింఛన్ పంపిణీ చేసేందుకు పోస్టుమెన్ తలలు పట్టుకుంటున్నారు. పింఛన్ ఇచ్చే సమయంలో సిగ్నల్ లేక లబ్ధిదారుల వేలి ముద్రలను మిషన్ తీసుకోకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు. దీంతో పింఛన్ మిషన్లను పట్టుకొని రోడ్ల వెంట సిగ్నల్ కోసం పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొన్నది. సమీపంలో ఎత్తుగా ఉన్న ప్రాంతాలకెళ్లి పింఛన్లను లబ్ధిదారులకు అందిస్తున్నారు. మండలంలో గత వారం రోజులుగా ఇదే దుస్థితి నెలకొన్నది. దీంతో లబ్ధిదారులు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పింఛన్ డబ్బుల కోసం పడిగాపులు కాస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూసి అలసిపోతున్నారు. ఒక్కో పోస్టుమన్ మేజర్ గ్రామపంచాయతీతోపాటు వాటి అనుబంధ గ్రామాలు, గిరిజన తండాల్లోనూ పింఛన్లను అందజేయాలి. సిగ్నల్ రాక పింఛన్ డబ్బులను సకాలంలో ఇవ్వలేకపోతున్నారు. ముఖ్యంగా ఈ సమస్య మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో జఠిలంగా ఉన్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మేడిపల్లి గ్రామంలో ఇదే సమస్య తలెత్తడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామాల్లో సిగ్నల్ సమస్య తలెత్తకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

### కొన్ని రోజులుగా తిరుగుతున్నా..



పింఛన్ డబ్బుల కోసం కొన్ని రోజులుగా తిరుగుతున్నా. అదేదో సిగ్నల్ రాక ఆలస్యమవుతున్నదంటా. ఉదయమే వెళ్లి పోస్టుమన్ దగ్గర కూర్చుండి నిరీక్షించినా ఫలితం ఉండడం లేదు. సిగ్నల్ సరిగ్గా రాకపోవడంతో నాకు డబ్బులు ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యల్లేకుండా చేయాలి. ఆ పైసలతోనే నాకు కావాల్సిన వస్తువులు, మందులు కొనుకుంటా.

-రాములమ్మ, మేడిపల్లి

### సిగ్నల్ సామర్థ్యాన్ని మెరుగుపర్చాలి..



సిగ్నల్ సమస్యను పరిష్కరించి పింఛన్ పంపిణీలో ఎలాంటి ఆటంకాల్లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. మండలంలో అన్ని నెట్‌వర్క్‌ల సిగ్నల్ సామర్థ్యాన్ని పెంచాలి. సిగ్నల్ లేక పింఛన్ లబ్ధిదారులు, పోస్టుమెన్ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలో బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి. ప్రతినెలా పింఛన్ డబ్బులను సకాలంలో లబ్ధిదారులకు అందేలా తగిన చర్యలు చేపట్టాలి.

-కాళ్ల జంగయ్య, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు



శంకర్‌పల్లి మండలంలోని సంకేపల్లి గ్రామంలో..





## ఊరూరా..

# బోనాల జాతర

### ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఘనంగా ఉత్సవాలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఆదివారం బోనాల ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. పలు పల్లెలు, పట్టణాల్లో మహిళలు బోనాలు ఎత్తుకుని అమ్మవార్ల ఆలయాలకు ఊరేగింపుగా వెళ్లి ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అందర్నీ చల్లంగ చూడాలని, ఈ ఏడాది పంటలు అధికంగా పండాలని వేడుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు చూపరులను అలరించాయి. ఈ బోనాల ఉత్సవాల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఊరువాడా.. పల్లె, పట్టణం.. బోనాల ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

– న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



కడ్తాల్ మండలంలోని గోవిందాయిపల్లి గ్రామంలో బోనాల ఉత్సవాలు





ఆర్కేపురం డివిజన్‌లోని ఖిల్లా మైసమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి